ప్రజాశక్తి
శుక్రవారం 2 ఆగస్టు 2024
5
శ్రీకాకుళం

ప్రత్యేక కౌంటర్లలో విక్రయాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నిత్యావసర వస్తువుల ధరల స్థిరీకరణకు, సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో మార్కెట్లు, రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లను ప్రారంభించినట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. అధిక నాణ్యత కలిగిన కందిపప్పు, బియ్యం అందుబాటు ధరలకు వినియోగదారులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కందిపప్పు (దేశవాళీ రకం) కేజీ రూ.160 నుంచి 150, బియ్యం (ఫైన్ స్టీమ్ బియ్యం) కేజీ రూ.49 నుంచి 48, ఫైన్ రా బియ్యం కేజీ రూ.48 నుంచి 47కు తగ్గించి విక్రయాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

- జిల్లాలో 2.48 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- 2.26 లక్షల ఎకరాల్లో వరి వేసిన రైతులు
- ఇటీవల కురిసిన వర్షాలతో ఊపందుకున్న వ్యవసాయ పనులు
- రిజర్వాయర్లలో పెరుగుతున్న నీటి నిల్వలు

ఖరీఫ్ పనుల జోరు

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో ఖరీఫ్ పనులు జోరందుకున్నాయి. జూన్‌లో సాధారణంగా కురవాల్సిన వర్షం కంటే తగ్గినా, జులైలో కురిసిన వర్షాలతో ఈ సీజన్‌లో సాధారణం కంటే అదనంగా వర్షం కురిసింది. వంశధార, నాగావళి నదుల్లో నీటి ప్రవాహం కొంతవరకు పెరగడంతో అధికారులు కాలువల ద్వారా నీటిని విడిచిపెడుతున్నారు. విస్తారంగా కురిసిన వర్షాలకు చెరువులు నిండడంతో, వాటి ఆయుకట్టు కింద ఉన్న భూములకు పుష్కలంగా సాగునీరందుతోంది. పంట కాలువల్లో నీరు నిండుగా ప్రవహిస్తుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మొత్తం మీద సాగునీటి ఇబ్బందులు తీరడంతో ఖరీఫ్ సీజన్‌లో సాగు ఆశాజనకంగా ఉంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,21,655 ఎకరాల్లో వేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అదేవిధంగా వరి పంటను 3,87,323 ఎకరాల్లో వేస్తారని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఖరీఫ్‌లో జూలై ఒకటో తేదీ నాటికి అన్నిరకాల పంటలు కలిపి 24,148 ఎకరాల్లో విత్తనాలు వేశారు. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలతో నాలుగు వారాల వ్యవధిలో పంటల సాగు అమాంతంగా పెరిగింది. అదేవిధంగా వరి పంట సాగు 19,990 ఎకరాల నుంచి 2,25,778 ఎకరాలకు పెరిగింది. మొక్కజొన్న పంటను 25,270 ఎకరాల్లో వేస్తారని లక్ష్యంగా నిర్ణయించగా, ప్రస్తుతం 19,438 ఎకరాల్లో వేశారు. మినప పంట 172.5 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేయగా, ఇప్పటివరకు 28 ఎకరాల్లో వేశారు.

వేరుశనగ పంటను 730 ఎకరాల్లో విత్తనాలు వేయాల్సి ఉండగా 183 ఎకరాల్లో వేశారు. పత్తి 3,888 ఎకరాలకు గానూ 1890 ఎకరాల్లో, గోగు పంట 142.5 ఎకరాలకు గానూ ఐదు ఎకరాల్లో, చెరుకు 3,485 ఎకరాలకు గానూ 435 ఎకరాల్లో వేశారు. రాగులు, నువ్వులు ఇప్పటివరకు ఒక్క ఎకరాలోనూ విత్తనాలు పడలేదు.

ఆ మండలాల్లో వరి సాగు బాగు

జిల్లాలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం కురిసిన మండలాల్లో సాగు పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయి. సరుబుజ్జిలి మండలంలో 12,845 ఎకరాల్లో వరి వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా 11,990 ఎకరాల్లో (93 శాతం) వేశారు. పాతపట్నం మండలంలో 17,120 ఎకరాల్లో వరి వేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా, ఇప్పటివరకు 14,875 ఎకరాల్లో (87 శాతం) వేశారు. ఎల్ఎన్‌పేటలో 10,738 ఎకరాలకు గానూ 8,763 ఎకరాల్లో (82 శాతం) వరి సాగు అయింది. కొత్తూరులో 14,318 ఎకరాలకు గానూ 11,538 ఎకరాల్లో (81 శాతం) సాగు నమోదైంది. బూర్జ మండలంలో 12,303 ఎకరాల్లో వరి సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా 9,950 ఎకరాల్లో (81 శాతం) సాగు అయింది. నరసన్నపేటలో 18,740 ఎకరాలకు గానూ 14,125 ఎకరాల్లో (75 శాతం) వరి విత్తనాలు వేశారు.

ఖరీఫ్‌లో సాధారణం కంటే అదనపు వర్షపాతం

జూన్‌లో సాధారణంగా 134.9 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, 128.9 మి.మీ వర్షం కురిసింది. వర్షపాతం లోటు 4.4 శాతంగా నమోదైంది. జూలై రెండో వారం వరకు జిల్లాలో వర్షపాతం లోటు కొనసాగింది. జూలై 1 నుంచి 31వ తేదీ వరకు సాధారణంగా 177 మి.మీ వర్షపాతం నమోదవుతుంది. ఆ నెలలో 217.4 మి.మీ వర్షం కురిసింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన జూన్ ఒకటి నుంచి ఇప్పటివరకు 309.9 మి.మీ వర్షం పడాల్సి ఉండగా, 346.3 మి.మీ వర్షం కురిసింది. జిల్లాలోని 30 మండలాలకు గానూ నాలుగు మండలాల్లో అధిక వర్షం కురిసింది. తొమ్మిది మండలాల్లో సాధారణ వర్షపాతానికి మించి వర్షం పడింది. 12 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, ఐదు మండలాల్లో ఇంకా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.

రిజర్వాయర్లలో క్రమేణా పెరుగుతున్న నీటి నిల్వలు

వర్షాభావ పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జిల్లాలోని రిజర్వాయర్లు, బ్యారేజీల్లో నీటిమట్టం నిల్వలు పడిపోతున్నాయి. హిరమండలం వద్ద ఉన్న గొట్టాబ్యారేజీ కెపాసిటీ 0.66 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 0.64 టిఎంసిల నీరు లభ్యమవుతోంది.

మడ్డువలస రిజర్వాయర్ సామర్థ్యం 3.37 టిఎంసిలు కాగా, ఈనెల ఒకటో తేదీ వరకు టిఎంసి నీరు మాత్రమే లభ్యమయ్యేది. ప్రస్తుతం 2.25 టిఎంసిల నీరు అందుబాటులో ఉంది. తోటపల్లి రిజర్వాయర్ 2.50 టిఎంసిల నీరు లభ్యం కావాల్సి ఉండగా, ప్రస్తుతం 2.18 టిఎంసిల నీరు ఉంది.

త్వరలో కొత్త పింఛన్లు

వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

పింఛన్‌ను అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

రాష్ట్రంలో 64 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, త్వరలో అర్హులైన వారిని గుర్తించి కొత్త పింఛన్లు ఇస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. టెక్కలిలోని కంద్రక వీధిలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదలకు పింఛన్లు అందజేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కీ.శే నందమూరి తారక రామారావుకే దక్కుతుందన్నారు. ఎన్నికల కోడ్ సమయంలో అప్పటి ప్రభుత్వం పింఛను సొమ్మును బ్యాంకుల్లో వేసి లబ్ధిదారులను మండుటెండలో బ్యాంకుల చుట్టూ తిప్పిందని విమర్శించారు. సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేయాలని తాము సూచించినా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక సచివాలయ ఉద్యోగులతోనే ఇంటికే పెన్షన్‌ను అందిస్తున్నామని తెలిపారు. ఉదయం ఏడు గంటలకే జిల్లాలో 89 శాతం పింఛన్లు పంపిణీ చేసి రికార్డు సృష్టించామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని, అయినా ఎన్నికల్లో హామీ ఇచ్చిన పథకాలన్నీ విడతల వారీగా అందిస్తామని చెప్పారు. మత్స్యకారుల జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. మత్స్యకారులకు ఇబ్బందిగా పరిణమించిన 217 జిఒను రద్దు చేస్తామని, ఇందుకు సంబంధించి ఈనెల ఏడో తేదీన నిర్వహించే కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. కంద్రక వీధి అభివృద్ధికి బాటలు వేస్తామని, ఒక మోడల్ వీధిగా తయారు చేస్తామని హామీనిచ్చారు.

నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని బలగ డిఎల్‌టిసిలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్టు, యెకోమా కంపెనీలో ప్రొడక్షన్ సిబ్బంది, హెట్రో ల్యాబ్‌లో ప్రొడక్షన్ కెమిస్ట్, ఎలక్ట్రీషియన్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్త్రీ, పురుష అభ్యర్థులు ఈ ఎంపికలో పాల్గొనేందుకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. పోస్టులకు అవసరమైన విద్యా ప్రమాణాలు గల వారు నేరుగా ఇంటర్వ్యూలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

- కుక్క కాటుకూ రిఫర్ చేయడం సరికాదు
- పనిచేయడం ఇష్టం లేకపోతే బదిలీపై వెళ్లిపోవాలి
- జిల్లా కేంద్రాస్పత్రి సమీక్షలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హెచ్చరించారు. జిల్లా కేంద్రాస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ బొడ్డేపల్లి సూర్యారావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కుక్క కాటు రోగులనూ శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి రిఫర్ చేయడం ఎంతవరకు సమంజసమని వైద్యులను ప్రశ్నించారు. ప్రైవేటు ప్రాక్టీస్‌పై ఉన్న శ్రద్ధ ప్రభుత్వాస్పత్రిలో వైద్యం చేయడానికి ఉండడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరికైనా ఇష్టం లేకపోతే బదిలీపై వెళ్లిపోవాలని సూచించారు. ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణపై దృష్టిసారించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో బెడ్‌షీట్లు, మందులకు నెలకు ఎంత నిధులు అవసరమవుతాయని మంత్రి ప్రశ్నించగా, రూ.పది లక్షలు సరిపోతాయని వైద్యాధికారులు బదులిచ్చారు. ఆస్పత్రికి మినరల్ వాటర్ ప్లాంట్ కావాలని కోరారు. వేసవిలో తాగునీటి కొరత ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకురాగా, మినరల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ఆస్పత్రికి అవసరమైన ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు అందజేసేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వారం రోజుల్లో మళ్లీ వచ్చి ఆస్పత్రిలోని వార్డుల్లో తిరుగుతానని, అన్నీ సక్రమంగా ఉండాలన్నారు. ఆస్పత్రిలో మూడు ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేస్తున్నామని, ఎవరిపైనైనా ఫిర్యాదులు వస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గానికి ఇంటింటికీ తాగునీరు కోసం 460 ప్రతిపాదనలు పంపించామని, ఆస్పత్రికి కావాల్సిన నీటిని అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఆదేశించారు. గతం కంటే ప్రసవాల సంఖ్య ఎందుకు తగ్గాయని గైనకాలజిస్టు జ్ఞానప్రసన్నను మంత్రి ప్రశ్నించారు. మత్తు డాక్టర్ లేకపోవడంతో ప్రసవాలు చేయలేకపోతున్నామని ఆమె బదులిచ్చారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ రెండు వారాలకోసారి సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. ఆస్పత్రిలో పోలీస్ అవుట్‌పోస్టు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని ఆదేశించారు. సమావేశంలో డిసిహెచ్ఎ డి.జయలక్ష్మి, టిడిపి నాయకులు కింజరాపు హరివరప్రసాద్, ఎల్.ఎల్.నాయుడు, బగాది శేషగిరిరావు, పినకాన అజయ్‌కుమార్, జనసేన నాయకులు కణితి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా పర్యాటక అభివృద్ధి మండలి సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక రంగం అభివృద్ధికి అనువైన ప్రదేశాలపై పూర్తి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. బుద్ధ క్షేత్రంగా వెలుగొందుతున్న ప్రాచీన స్థలం శాలిహుండంతో పాటు శ్రీకూర్మనాథస్వామి ఆలయం, సముద్ర తీరం వెంబడి బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు అనువైన పరిస్థితులపై చర్చించారు. ఆలయాల్లో వస్తున్న ఆదాయ వనరులు, అందుబాటులో ఉన్న సౌకర్యాలను దేవాదాయ శాఖ సహాయక కమిషనర్ ప్రసాద్ పట్నాయక్ వివరించారు. పురావస్తుశాఖ పరిధిలో జిల్లాలో శ్రీకూర్మనాథ స్వామి ఆలయం, శ్రీముఖలింగేశ్వర స్వామి, అరసవల్లి సూర్యనారాయణ స్వామి, మందస వాసుదేవపెరుమాళ్, మెళియాపుట్టి రాధాకాంత స్వామి ఆలయాలు ఉన్నాయని తెలిపారు. వాటితోపాటు గ్రామీణ ప్రాంతంలో అనేక ఆలయాలు ప్రాచీన చరిత్ర కలిగి ఉన్నాయని వివరించారు. వీటిని అనుసంధానించడంతో పాటు ఆలయాల అభివృద్ధికి అవసరమైన నిర్మాణాలు చేపట్టాని కలెక్టర్ ఆదేశించారు. శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.నాలుగు కోట్లతో చేపట్టనున్న పనులకు సంబంధించి టెండర్ల దశలో ఉన్నాయని తెలిపారు. ఇతర ప్రాంతాల పర్యాటకులు జిల్లా పర్యాటకాన్ని సందర్శిస్తే వారికి అవసరమైన భోజన, వసతి సౌకర్యాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒలు సిహెచ్.రంగయ్య, భరత్ నాయక్, సుదర్శన్ దొర, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, రీజనల్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు, ఆర్కియాలజి టెక్నికల్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, శ్రీకూర్మం ఆలయ ఇఒ గురునాథరావు, సదరన్ ట్రావెల్ మేనేజర్ ఉత్తమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి

చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం, కవిటి

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి ఆదేశించారు. ఇచ్ఛాపురంలోని పురుషోత్తపురం వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును గురువారం తనిఖీ చేశారు. వాహనాల తనిఖీల తీరును పర్యవేక్షించారు. నాటుసారా, గంజాయి, ఇతర నిషేధిత సామగ్రి అక్రమ రవాణా కాకుండా ముమ్మరంగా వాహనాలు తనిఖీలు చేపట్టాలని సూచించారు. పక్క రాష్ట్రాల నుంచి రాకపోకలు సాగించే వాహనాలపై నిఘా ఉంచాలన్నారు.

అనంతరం కవిటి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కేంద్రం, రికార్డుల నిర్వహణ, ప్రాపర్టీ భద్రపరిచే గదులను పరిశీలించారు. ముఖ్యమైన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. సిబ్బందికి కేటాయించిన విధులు, పనితీరును ఆరా తీశారు. స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పెండింగ్ కేసులపై నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇమ్మాన్యుల్ రాజు, ఇచ్ఛాపురం, కవిటి ఎస్ఐలు ఎన్.లక్ష్మణరావు, లక్ష్మణరావు, కె.రాము పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేష్ఠం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఎంతో శ్రేష్ఠమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి అన్నారు. తల్లి పాల వారోత్సవాలను జెండా ఊపి గురువారం ప్రారంభించారు. జిల్లాలో గ్రామ గ్రామాన తల్లి పాల వారోత్సవాలను నిర్వహించడం ద్వారా తల్లులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి గ్రామంలో వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించాలన్నారు. గర్భిణులు, బాలింతలతో సమావేశాలు నిర్వహించిన అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కె.వెంకటరావు, డిపిఎంఒ జి.వెంకటలక్ష్మి, డెమో ఎం.వెంకటేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్లు ఎస్.సూర్యకళ, పి.మోహిని తదితరులు పాల్గొన్నారు.

వారోత్సవాలను ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

విద్యార్థులు అధైర్యపడొద్దు

ప్రజాశక్తి - నందిగాం

స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలను పలాస ఆర్‌డిఒ భరత్ నాయక్, గురుకుల విద్యాలయాల సమన్వయకర్త బాలాజీ నాయక్ పరిశీలించారు. తరగతి గదులు, డార్మిటరీని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థినులు అధైర్యపడొద్దని, సమస్యలు ఏమైనా ఉంటే హెచ్ఎంకి తెలియజేయాలన్నారు. విద్యార్థుల్లో మనోధైర్యం నింపాలని, భయం లేకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థిని అక్షిత ఆత్మహత్యపై సమగ్ర దర్యాప్తు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.భాగ్యలక్ష్మి, ఎస్ఐ మహమ్మద్ అమీర్ అలీ, ప్రిన్సిపాల్ బి.దమయంతి, గురుకుల విద్యాలయాల వైద్యులు రాజేష్ ఉన్నారు.

విద్యార్థిని మృతిపై సమగ్ర దర్యాప్తు

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - కొత్తూరు

నందిగాంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థిని నిమ్మక అక్షిత మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగరాపు సింహాచలం, బిఎస్‌పి నియోజకవర్గ నాయకులు బొడ్డేపల్లి కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మాసింగిలో మృతురాలి కుటుంబసభ్యులను గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్షిత ఆత్మహత్యకు గల కారణాలను వెంటనే పోలీస్ యంత్రాంగం ఛేదించాలని డిమాండ్ చేశారు. అక్షిత మృతిపై ఆమె తల్లిదండ్రులు, బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, మృతదేహాన్ని చనిపోయిన స్థలం నుంచి తల్లిదండ్రులు వచ్చేంత వరకు ఉంచకుండా పోస్టుమార్టం కోసం హడావుడిగా తరలించడం ఏమిటని ప్రశ్నించారు. రాత్రి సమయంలో పోస్టుమార్టం చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. కలెక్టర్ జోక్యం చేసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అక్షిత కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పరామర్శిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

సహకార సంఘాలతో విస్తృత సేవలు

గోదాముల నిర్మాణం వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో రైతాంగానికి అవసరమైన సేవలను మరింత విస్తృతపరచడానికి సహకార సంఘాలు తోడ్పడాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన జిల్లా సహకార సలహా సంఘం సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది సాగుకు అనుకూల పరిస్థితి ఉండడం వల్ల దిగుబడులు పెంచుకునేందుకు వీలుందన్నారు. రైతులు సాగులో మెలకువలు పాటిస్తూ యాజమాన్య పద్ధతులు అనుసరించేలా వ్యవసాయశాఖ కృషి చేస్తోందన్నారు. సకాలంలో రైతులకు రుణాలు ఇచ్చి సాగు పెట్టుబడికి తోడ్పడాలన్నారు. సహకార సంఘాల ద్వారా ఎరువులు, పురుగు మందులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సహకార శాఖ పరిధిలో గతంలో మంజూరైన గొడౌన్ల నిర్మాణం స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు వాటిని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో పాటు జిల్లా సహకార అధికారి సుబ్బారావు, వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్, డిసిసిబి సిఇఒ వరప్రసాద్, డిపిఒ వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ జెడి శ్రీనివాసరావు, ఎపిఎంఐపి డీడీ శ్రీనివాసరావు, గృహనిర్మాణ శాఖ పీడీ నగేష్, మార్కెటింగ్ శాఖ ఎడి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పత్రికా ప్రకటన

పాస్ పోర్ట్ పోయింది. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం జి కరాపాడు గ్రామానికి చెందిన **మురపాల శేషగిరి** S/o గవరయ్య చెందిన పాస్ పోర్ట్ నెంబర్ L 9026327 జి కరాపాడు నుంచి రాజపురం మీ సేవకు వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయింది. ఎవరికైనా దొరికిన ఎడల మురపాల శేషగిరికి గానీ కవిటి పోలీస్ స్టేషన్లో కానీ అప్పగించాలని విజ్ఞప్తి.

ఫోన్ నెంబర్: 7207265970

పాస్‌పోర్టు మరియు సర్టిఫికేట్స్ పోయినవి

నేను అనగా **కల్లేపల్లి సుప్రియ** తండ్రి లేటు నాగభూషణరావు దీపా మహల్ వైపునున్న బ్యాంకర్స్ కాలనీలో నివాసం ఉంటున్నాను నేను గత మూడు రోజుల క్రిందట నా యొక్క పాస్పోర్టు మరియు బీటెక్ మార్క్స్ మెమో జిరాక్స్ కొరకు శ్రీకాకుళంలో ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర్లో ఉన్న జిరాక్స్ సెంటర్లో జిరాక్స్ తీసుకుని తిరిగి వస్తుండగా నా యొక్క సర్టిఫికెట్లు పోయినవి కావున మీకు ఎవరికైనను దొరికినట్లైతే పైన తెలిపిన అడ్రస్ కు ఇవ్వవలసిందిగా కోరుతున్నాను

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE, TEKKALI.
I.A.128/2022 in O.S.62/2022.

Between:
Duvvada Kalyani ......Petitioner/Plaintiff.
And:
To
1. Chapa Appayya,
2. Chapa Raju.
3. Hanumanthu Niranjan,
4. Koona Venkati,
5. Chapa Hemachalam.

......Respondents/Defendants.

R.2: Chapa Raju, s/o Chapa Appayya, aged 45 years, permanent resident of Door No.55, Pratapa-Viswanadhapuram village & Panchayat, Govindapuram P.O., Nandigam Mandal, Srikakulam Dist.

Where as the above named petitioner/plaintiff has instituted the above petition against you and others for a temporary injunction restraining you and others from alienating the petition schedule property to any third party, you hereby summoned to appear in this Court in person or by a Advocate duly instructed and able to answer all material questions relating to the petition on **06-08-2024 at 10-30 A.M.** to answer the petition claim, and at the day fixed for your appearance is appointed for the final disposal of the petition.

Take notice that in default of your appearance on the day and hour before mentioned. The petition will be heard and determined in your absence.

//BY ORDER//
P.G. RAJARATNAM
ADVOCATE, PALASA,
SRIKAKULAM DIST., A.P.
Mobile No.9985827526.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

పొందూరు : పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పోలాకి : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- లావేరు

అన్ని వర్గాలు ప్రజల సంక్షేమమే కూటమి సిఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని తామాడ, లక్ష్మీపురం పంచాయతీల్లో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. తామడలో ఎమ్మెల్యే పింఛన్లను పంపిణీ చేశారు. తాళ్లవలసలో టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ముప్పుడి సుజాత పింఛన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పుడి సురేష్, జనసేన ఎచ్చెర్ల ఇన్‌ఛార్జి విశ్వక్సేన్, ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, ఎంపిడిఒ కె.కొండలరావు, మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనువాసరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: గార, శ్రీకాకుళం రూరల్, నగర పరిధిలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. రూరల్ మండల పరిధిలోని అలికాం, భైరివానిపేట, ఎస్ఎస్ వలస పంచాయతీల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్‌తో పాటు ఎంపిడిఒ పాల్గొనగా, గార మండల పరిధిలోని సతివాడ, రామచంద్రపురం, వాడాడ పంచాయతీల్లో, నగర పరిధిలోని 38, 39, 40 డివిజన్ల దమ్మలవీధి అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద, 29, 30 డివిజన్లలో సంతోషిమాత దేవాలయం వద్ద, 7వ డివిజన్ శాంతినగర్ కాలనీ, 48 డివిజన్ ఫాజుల్ బాగ్ పేట తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే శంకర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు, నగరంలో డివిజన్ ఇన్‌ఛార్జిలు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

చాపురం విలీన పంచాయతీలో రూరల్ మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి అల్లు నరసయ్య ఆధ్వర్యంలో ఆర్‌డిఒ రంగారావు పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.గణపతిరావు, మాజీ ఎంపిటిసి మట్ట ఆనంద్, బూత్ ఇన్‌ఛార్జిలు డొంక శోభన బాబు, తొంగి గోవింద, వై.చెల్లయ్య, మరడన సురేష్, పల్లి శేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొందూరు: మండలం కనిమెట్టలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పింఛన్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గం పింఛన్ల పంపిణీ కార్యక్రమ పరిశీలకులు తాడికొండ చంద్రశేఖర్‌యాదవ్, ఎంపిడిఒ సూర్యనారాయణ, ఇఒపిఆర్‌డి సింహాచలం, మాజీ సర్పంచ్ అన్నెపు శ్రీనివాసరావు, ఎంపిటిసి ప్రతినిధి కూన కృష్ణమూర్తి, టిడిపి నాయకులు పైడి రాంప్రసాద్, కూటికుప్పల హనుమంతురావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మెళియాపుట్టిలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సలాన మోహనరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌గౌడ, ఎంపిటిసి నంబాల వెంకటరావు పాల్గొన్నారు.

పోలాకి: మండలంలోని మబగాం, పోలాకి, రాళ్లపాడు, కె.పి.వలస గ్రామాల్లో వృద్ధులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఎం.వెంకటఅప్పలనాయుడు, తహశీల్దార్ ఎం.సురేష్ కుమార్, ఎంపిడిఒ ఉషశ్రీ, సూపరింటెండెంట్ సూర్య ప్రకాష్, టిడిపి సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని భైరిపురం, కమలాయిపుట్టుగ గ్రామాల్లో ఆర్‌డిఒ భరత్ నాయక్ పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.మురళీమోహన్, టిడిపి నాయకులు మణిచంద్రప్రకాష్, బెందాళం రమేష్, బాసుదేవ్ రౌలో, సంతోష్ పట్నాయక్, పుల్లట సంతోష్, బెందాళం తిరుమలరావు, సనపల కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని లొద్దపుట్టి, కె.ఎల్.కుంచి, హరిపురం, రత్తకన్న గ్రామాల్లో పింఛన్ల పంపిణీని ఆర్‌డిఒ భరత్ నాయక్ పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటరావు, డిటి శ్రీహరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలాస : మండలంలోని రెంటికోట, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డులో ఎమ్మెల్యే గౌతు శిరీష పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి

పలాస : పింఛను పంపిణీ చేస్తున్న శిరీష

వజ్జ బాబూరావు, ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, పి.విఠల్‌రావు, కుత్తుం లక్ష్మణ్‌కుమార్, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కార్యదర్శి సద్గుణబాబు పాల్గొన్నారు. అలాగే పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పద్మనాభపురంలో ఆర్‌డిఒ భరత్ నాయక్ పింఛన్లను పంపిణీ చేశారు.

కొత్తూరు : మండలంలోని బలదలో వృద్ధులకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ త్రివిక్రమరావు, డిటి సత్యనారాయణ, టిడిపి నాయకులు మాతల గాంధీ, మాజీ సర్పంచ్‌లు కొమరపు వెంకటరావు, రమణమూర్తి, ఇ.లక్ష్మణరావు, మాధవరావు, టి.తిరుపతిరావు, వై.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

హిరమండలం : మండలంలోని ధనుపురంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిరుపతిరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

శ్రీకాకుళం రూరల్ : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

లావేరు : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

సత్యనారాయణను సన్మానిస్తున్న రాజేష్

పాత్రికేయ వృత్తికి గౌరవం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

తన వార్తల ద్వారా వృత్తికి గౌరవం కల్పించిన పాత్రికేయుడు పూడి సత్యనారాయణ అని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లోల్ల రాజేష్ అన్నారు. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం సంయుక్తంగా అందిస్తున్న ఉత్తమ తెలుగు జర్నలిస్టు పురస్కారానికి సత్యనారాయణ ఇటీవల ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం రాజేష్ ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కవిటి మండలంలో తన వార్తల ద్వారా ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. ఆపదలోని అనేక మందికి తన కథనాల ద్వారా ఆర్థిక సాయం అందేలా చేసిన ఘనత సత్యనారాయణకి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో దాలయ్య, బల్లెడ రమేష్, ఆరింగి వెంకటరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

ప్రజాశక్తి- సోంపేట

ఆధునికత మోజులో పడి విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సంస్కార భారతి విద్యాసంస్థల్లో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగం, కలిగే అనర్థాలు, చట్టాలను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కుల ఒత్తిడిలో పడి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని పిలుపునిచ్చారు. ప్రశాంతమైన, ఒత్తిడి లేని జీవితాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సర్వేశ్వరరావు, ఎజిపి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కంచిలి

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఎంఇఒలు శివరాంప్రసాద్, చిట్టిబాబు, ఎంపిడిఒ నీరజ, తహశీల్దార్ కార్యాలయాల్లో గురువారం వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అడిట్ కమిటీ సభ్యులు సుదర్శన్ బెహర, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీనాయిక్, నల్లన రవి, కోశాధికారి టి.త్రినాథ్, ఎస్.వెంకటరావు, పైల పురుషోత్తమరెడ్డి, జె.భగవతిరావు, క్రాంతికుమార్, త్రిలోచన్ ప్రధాన్, హేమసుందర్, నిరంజన్ బెహరా, ప్రసున్న ప్రధాన, భాస్కరరావు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

తహశీల్దార్ల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వజ్రపుకొత్తూరు మండలం తహశీల్దార్‌గా పి.బాల గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఆమె ఎన్నికల విధుల్లో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా సొంత జిల్లాకు ఆమెను కేటాయించారు. గతంలో కొత్తూరు తహశీల్దార్, పలాస రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో పరిపాలన అధికారిగా ఆమె విధులు నిర్వహించారు. ఆమెను కార్యాలయం సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, డిపో డీలర్లు పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో డిటి వి.గిరిరాజ్, ఆర్ఐ పవిత్ర, మండల డీలర్ల సంఘం నాయకులు కోనేరు కామేష్, తవిటయ్య పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి తహశీల్దార్‌గా ఎస్.దిలీప్‌చక్రవర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. చౌక ధరల దుకాణ సంఘ అధ్యక్షులు కిమిడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డీలర్లు మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు శ్యామ్, మల్లేశ్వరరావు, మిస్రో

పలాస : ఎమ్మెల్యే శిరీషకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహశీల్దార్ సత్యం

పాల్గొన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ సుదర్శన్‌దొరను మర్యాదపూర్వకంగా కలిశారు.

పలాస : పలాస మండల తహశీల్దార్‌గా సత్యం గురువారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో పనిచేసిన తహశీల్దార్ ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడు బదిలీపై అనకాపల్లి జిల్లా చోడవరానికి వెళ్లారు. సత్యం విజయనగరం జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో జలుమూరు తహశీల్దార్‌గా పనిచేశారు. ఆయనకు డిటి లక్ష్మీనారాయణ, సివిల్ సప్లయి డిటి రవికుమార్, ఆర్ఐ నిరంజన్, మండల సర్వేయర్ గిరి, రాజేష్ అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే గౌతు శిరీషను మర్యాదపూర్వకంగా కలిశారు.

శ్రీకాకుళం రూరల్ : శ్రీకాకుళం మండల తహశీల్దార్‌గా ఎస్.గణపతిరావు బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా అనకాపల్లి తహశీల్దార్‌గా విధులు నిర్వహించి ఇక్కడకు బదిలీపై వచ్చారు. కార్యాలయ సిబ్బంది అభినందించారు.

లావేరు : లావేరు మండల తహశీల్దార్‌గా వై.జోగారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన లక్ష్మిదేవి విశాఖపట్నం జిల్లాకు బదిలీ కావడంతో జోగారావు అమరావతి సిసిఎల్ఎ నుంచి బదిలీపై వచ్చారు. నూతన తహశీల్దార్‌కు డిటి నారాయణమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది, విఆర్‌ఒలు పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు రత్నాకర్, వాళ్లే భాస్కరరావు, కీర్తి వెంకట రమణ, విఆర్‌ఒలు ఉన్నారు.

పొందూరు: మండల తహశీల్దార్‌గా ఎన్.రమేష్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈయన అనకాపల్లి జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. బాధ్యతలను చేపట్టిన ఈయనను డిటి శ్రీనివాసరావు, ఆర్ఐ రాధ, సర్వేయర్లు, కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

కొవ్వొత్తులతో నివాళ్లర్పిస్తున్న గ్రామస్తులు

వయనాడ్ మృతులకు నివాళి

ప్రజాశక్తి- కవిటి

కేరళ రాష్ట్రం వయనాడులో కొండ చర్యలు విరిగిపడి 123 మంది మృతి సంఘటనపై మండలంలోని ఎర్ర గోవిందపుట్టుగలో గురువారం సాయంత్రం సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఈపిరి రమణమూర్తి, సిహెచ్.రమేష్, సిహెచ్.శేఖర్, పి.శ్రీను, పి.గురునాథం, పి.రాజు, పి.చంద్రశేఖర్, పి.నాని, సిహెచ్.నరేష్, పి.లోకు, ఎన్.పురుషోత్తం పాల్గొన్నారు.

తలసేమియా ఆపరేషన్ విజయవంతం

చికిత్స పొందుతున్న కౌషిక్

శ్రీకాకుళం అర్బన్ : ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పాలకొండ పెద్ద కాపువీధికి చెందిన కౌషిక్ (7) బాలుడు తలసేమి యా వ్యాధితో బాధపడుతున్నాడు. బాలుడికి కడుపునొప్పి, తలనొప్పి, వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురవుతుండడంతో వైద్యపరీక్షలు జరిపిం చారు. ప్రతినెలా హెమోగ్లోబిన్ తగ్గడంతో బాలుడికి తలసేమియా వ్యాధి ఉందని వైద్యులు గుర్తించారు. ప్రతినెలా రక్తం తగ్గుతుండడంతో బాలుడు తల్లిదండ్రులు శ్రీకాకుళంలో న్యూబ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ సహకారాన్ని కోరారు. ఆయన సలహా మేరకు నగరంలోని ఆర్కే ఆస్పత్రి డాక్టర్ బాడాన రామ కోటేశ్వరరావును సంప్రదించాలని సూచించారు. దీంతో వైద్య పరీక్షల నిమిత్తం డాక్టర్ రామకోటేశ్వర రావు దగ్గరకు వచ్చి వైద్య పరీక్షలు జరిపించుకున్న అనంతరం రోగికి శస్త్ర చికిత్స అవసమని గుర్తించి ఆపరేషన్ చేశారు.బాలుడు ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

బూర్జ : మండలంలోని అన్నంపేటకు చెందిన వ్యక్తి శ్రీకాకుళం పట్టణంలో ఒక ప్రయివేట్ కళ్యాణ మండపంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇందుకు సంబంధించిన కుటుం బసభ్యుల వివరాల మేరకు గ్రామానికి చెందిన కరణం మహేష్ (25) గత కొన్నేళ్లుగా శ్రీకాకుళం పట్టణంలో లాడ్జీలో పనిచేస్తున్నాడు. అయితే ఈయనపై గిట్టని వ్యక్తులు మంగళవారం రాత్రి పథకం ప్రకారం ఫ్యానుకు ఉరివేసి చంపారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న మహేష్ అకాల మృతిపై గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడికి తల్లిదండ్రులతో పాటు అన్నయ్య ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ఆమదాలవలస : మండలంలోని నిమ్మతోర్లాడలో విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం నిమ్మ తొర్లాడకు చెందిన రైతు వండాన పోలినాయుడు తన ఎద్దులతో గ్రామంలోని వేరొకరి పొలంలో కూలి పనిలో భాగంగా దమ్ము పట్టడానికి వెళ్లారు. పొలంలో దమ్ము పడుతుండగా విద్యుత్ స్తంభం వద్దకు వెళ్లేసరికి ఎద్దు ఒక్కసారిగా పొలంలో కుప్పకూలి పోయింది. దీంతో రైతు ఆందోళనకు గురై ప్రక్కన వున్న వారికి కేకలు వేసి పిలిచాడు. వారు వచ్చేసరికి విద్యుత్‌షాక్‌కు గురై మూగజీవి ప్రాణం విడిచిందని నిర్ధారణ చేసి విద్యుత్ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడకి చేరుకున్న లైన్‌మేన్ గోపి విద్యుత్‌ను నిలిపివేసి ఎద్దును బైటకు తీసేందుకు సహకరించారు.

సంక్షిప్త వార్తలు

ఆరోగ్యశ్రీ నిర్వీర్యానికి కుట్ర

రెడ్డి శాంతి

పాతపట్నం: ఆరోగ్యశ్రీని నిర్వీర్యానికి టిడిపి కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కీర్తిశేషులు వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీకి మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి రూ.25 లక్షల వరకు పెంచారని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో చేపట్టిన సంస్కరణలను చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేసేలా అడుగులు వేస్తుందన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

శ్రీకాకుళం అర్బన్ : మూడు దశాబ్దాల పోరాటాలకు న్యాయం చేస్తూ గురువారం ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన సానుకూల తీర్పు హర్షనీయమని జిల్లా ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు దాసరి తిరుమల మాదిగ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌సి వర్గీకరణను సమర్థించడంతో పాటు ఎస్‌సి 59 ఉప కులాలకు సమన్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తి అధికారం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా రాజ్యాంగ స్ఫూర్తితో దక్కిన రిజర్వేషన్ ఫలాలు అనేక అణగారిన కులాలు అందుకోలేక పోయారన్నారు. ఎట్టకేలకు సర్వోన్నత న్యాయస్థానం తీర్పును వెలువరించడం ఆనందంగా ఉందన్నారు.

టెక్కలి : ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుని స్వాగతిస్తున్నామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోను, దేశంలోను, వెనుకబడిన ఆదివాసీ తెగలకు న్యాయం చేకూరుతుందన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లోను, పరిశ్రమలోను, ఉపాధిలోను వెనుకబడిన ఆదివాసీ తెగలకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు వల్ల న్యాయం జరుగుతుందని అన్నారు.

హైకోర్టు పిపి బిసిలకు కేటాయించడంపై హర్షం

నౌపడ : తొలిసారిగా బిసిలకు హైకోర్టు పిపి (పబ్లిక్ ప్రాసిక్యూటర్) పదవి కూటమి ప్రభుత్వం కేటాయించడం హర్షనీయమని శ్రీకాకుళం పార్లమెంట్ రెడ్డిక సాధికారిక సమితి కన్వీనర్ సుగ్గు శాంతి స్వరూప్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడి బిసిలకు మొదటిసారి ఈ పదవీ కేటాయించారన్నారు. సంతబొమ్మాళి మండలం చిన్నతుంగాం పంచాయతీ కృష్ణచంద్రపురానికి చెందిన మెండ లక్ష్మీనారాయణకు కీలకమైన బాధ్యతలు ఇవ్వడం శుభపరిమాణం పేర్కొన్నారు. ఈయనతో పాటు రెడ్డిక సాధికారిక సమితి రాష్ట్ర డైరెక్టర్లు కర్రి హేమరావు, కర్రి నాగార్జున తదితరులు ప్రభుత్వానికి కృతజ్ఞతులు తెలిపారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నాగేంద్ర

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా అర్థశాస్త్ర అధ్యాపకులైన మాడుగుల నాగేంద్ర గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రాబిల్లి భూషణరావు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. నాగేంద్ర గతేడాది ఉద్యోగోన్నతిలో భాగంగా సరుబుజ్జిలిలో అధ్యాపకునిగా చేరారు. ఈ మేరకు ప్రిన్సిపాల్‌కు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

'అటల్ మార్థాన్'లో ఇప్పిలి విద్యార్థులకు ద్వితీయ స్థానం

ఎంపికైన విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్ : జాతీయ స్థాయిలో నిర్వహించిన అటల్ మార్థాన్ 2023-24 పోటీల్లో జిల్లాలోని ఇప్పిలి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు రెండో స్థానం దక్కింది. అటల్ టింకరింగ్ ల్యాబ్ విద్యార్థులు తయారు చేసిన ఎంటి సెలైన్ రిమైండరు ప్రాజెక్టుకు ఈ బహుమతి దక్కింది. ఈ ప్రాజెక్టును విద్యార్థులు రూపొందించడానికి ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి సహకారాన్ని అందించారు. ప్రాజక్టు రూపకల్పనలో విద్యార్థి నాయకుడిగా డి.నవీన్ కుమార్, సభ్యులుగా ఎస్.హాసిని, హరి, సింహాద్రిలు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఇన్‌ఛార్జి డిఇఒ తిరుమల చైతన్య అభినందించారు.

ఆర్థికసాయం అందజేత

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్లలో ఆర్.శోభారాణి అనారోగ్యంతో బాధపడుతుండి. విషయం తెలుసుకున్న హెల్పింగ్ వారియర్స్ సభ్యులు చందాలు వేసుకుంటూ రూ.16 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఎప్పుడు ఏ సహాయం కావాలన్నా తమ దృష్టికి తీసుకొస్తే ఆదుకుంటామని అన్నారు. కార్యక్రమంలో వూన హరికృష్ణ, లోకనాథం, వేణుగోపాల్, వూన విజయ్ పాల్గొన్నారు.

విశ్రాంత సైనికునికి ఘన స్వాగతం

రవిశేఖర్‌ను ఊరేగిస్తున్న గ్రామస్తులు

పొందూరు: దేశ రక్షణకు 22 ఏళ్లుగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఆర్మీ ఉద్యోగి ఇప్పిలి రవి శేఖర్‌కు గురువారం మండలంలోని బురిడి కంచరాం గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఓపెన్ టాప్ జీపుపై తండ్రి ఇప్పిలి సూరయ్యతో కలిసి ఆయనను ఊరేగిస్తూ పూలవర్షం కురిపించారు. ఈ ఊరేగింపులో గ్రామపెద్దలు, యువకులు, విద్యార్థులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సాగునీటికి పడిగాపులు

నీటి కోసం ఎదురుచూస్తున్న రైతులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సాగునీటి కోసం రైతులు వంశధార కాలువపై పడిగాపులు పడుతున్నారు. గురువారం పొద్దుపోతున్న సమయంలో సీతాపురం సర్పంచ్ తమ్మినేని ఢిల్లీరావు తమ గ్రామ రైతులతో కలిసి కనితివూరు 60 అర్‌ఎల్ కాలువ వద్ద వేచియున్నారు. నీటిని శివారు గ్రామానికి తీసుకెళ్లడానికి గ్రామ రైతులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. 22 మంది రైతులు కాలువ బట్టిపై గత మూడు రోజులుగా తిరుగుతూ నీరు సాగడానికి ఉన్న అడ్డంకులు తొలగిస్తున్నారు. వంశధార శివారు భూములకు మొదటగా సాగునీరు అందించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా జూలై మొదటి వారంలోనే నీరు వచ్చింది. పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని సాగునీటి చెరువులను నింపుతున్నారు. ఇటీవల పెద్దబొడ్డపాడు రామసాగరం సాగునీటితో నింపారు. ప్రస్తుతం సీతాపురం ఎర్ర చెరువులోకి నీరు వచ్చి చేరుతుంది. చెరువు నింపుకోడానికి కాలువపై ఉన్న ప్రధాన ఊటీలు వద్ద రైతులు రాత్రి, పగలు కాపలా ఉంటున్నారు. సీతాపురం ఎర్ర చెరువులోకి బెండికొండను ఆనించి నీరు రావలసి ఉంది. వంశధార 60 ఆర్ నుంచి రెండుగా చీలిపోయిన 60 ఆర్‌ఎల్ కాలువ సుమారు 5 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. అందువల్ల ఎర్ర చెరువులోకి నీరు చేరేటప్పటికి నీటి వడుసు తగ్గుతుందని రైతులు చెబుతున్నారు.

వికలాంగులకు సహకారం

న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

మాట్లాడుతున్న సన్యాసినాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అంగవైకల్యంతో బాధపడుతున్న వికలాంగులకు అధికార యంత్రాంగం పూర్తి సహకారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు సూచించారు. గురువారం న్యాయసేవా సదన్‌లో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అంగ వైకల్యంతో బాధపడుతున్న వారికి సకాంలో సంక్షేమ పథకాలు, ఇతర అవసరాలు తీర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వికలాంగుల్లో బాధితులుగా ఉన్నవారికి మరింత సహకారం అవసరమవుతుందన్నారు. అందువలన వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లు, అడ్డంకులు, అంతరాలపై చర్చించారు. ఈ సమావేశంలో వికలాంగుల సంక్షేమాధికారి కె.కవిత, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంఒయు పత్రంతో బొల్లినేని ప్రతినిధులు, ఒడిశా అధికారులు

ఒడిశాలో 'బొల్లినేని' మెడ్‌స్కిల్స్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ఒడిశా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు ఒడిశా ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా తొలుత గజపతి జిల్లా విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆ జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ సమక్షంలో అధికారులతో ఎంఒయు కుదిరిందని చెప్పారు. ఇప్పటి వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎనిమిదేళ్లుగా 9,200 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి 8,800 మంది విద్యార్థులకు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. ఒడిశా ప్రభుత్వం తమ సంస్థతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గజపతి జిల్లా ఉపాధి కల్పన అధికారి సౌభాగ్య, ఎస్ఆర్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పుష్పగుచ్ఛం అందజేస్తున్న అందజేస్తున్న నాయకులు

నందిగాం: జిల్లాలోని దళితుల, ఆదివాసీల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ఎపి దళిత మహాసభ ప్రతినిధి బి.నారాయణరావు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని జెసి ఫర్మాద్ అహ్మద్‌ఖాన్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని దళిత, ఆదివాసీ భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. భూస్వాములు, పెత్తందార్ల అక్రమ ఆక్రమణలో ఉన్న ల్యాండ్ సీలింగ్ భూములపై సమగ్ర సర్వే చేయించాలని కోరారు. మిగులు భూముల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మహాసభ జిల్లాశాఖ అధ్యక్షులు బోకర నారాయణరావు, కార్యదర్శులు డి.రాము, చింతాడ శ్రీనివాస్, ఎం.అప్పారావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో రాజకీయ క్రీనీడ

ప్రజాశక్తి- టెక్కలి

చదువులకు నెలవైన ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయ క్రీనీడలు ఆరంభమయ్యాయి. పాఠశాల విద్యా కమిటీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్‌ని ప్రభుత్వ విద్యాశాఖ జారీ చేసింది. రెండేళ్ల క్రితం ఎంపికైన కమిటీలు రద్దయ్యాయి. ఇందులో భాగంగా గురువారం నుంచి పాఠశాలల్లో ఎన్నికల కోడ్ అమలు కానుంది. విద్యార్థుల తల్లిదండ్రులు పేర్లు, వారి తరగతి, గ్రామం ఆధారంగా ఓటర్ల జాబితాలు రూపొందించారు. గత ప్రభుత్వ హయాంలో బాధ్యతలు స్వీకరించిన పేరెంట్స్ కమిటీ చైర్మన్లను మార్చి తమ వాళ్లను నిలబెట్టుంచుకోవాలని అధికార పార్టీకి చెందిన నాయకులు తహతహలాడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న పేరెంట్స్ కమిటీ స్థానంలో ఈ ప్రభుత్వం ఎస్ఎంసి (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) పేరుగా మార్చింది. ఆగస్టు 1 నుంచి 8వ తేదీలోగా పాఠశాల ఎన్నికలు పూర్తికావాలి. పాఠశాలల్లో రాజకీయాలు నెరపవద్దని చెబుతూనే... మరోపక్క కూటమి ప్రభుత్వం కొత్తగా ఏర్పడిన వెంటనే పాఠశాలల్లోని ఎండిఎం కార్మికులను, నైట్‌వాచ్‌మెన్లను, స్వచ్ఛ దూత్‌లను కొన్నిచోట్ల మార్చుకున్నారు. ఇప్పుడు తాజాగా స్కూల్ కమిటీ చైర్మన్లనే మార్చుకోనున్నారు. ఒక పాఠశాలలో చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు సభ్యులను ఎన్నుకోవాలి. విద్యార్థుల తల్లిదండ్రులకు మాత్రమే ఓటుహక్కు కల్పించారు. విద్యార్థులు ఉన్న తల్లిదండ్రులు మాత్రమే ఎన్నికల్లో నిల్చోవాలి. గ్రామాల్లోని నాయకులు మాత్రం పాఠశాల కమిటీ ఎన్నికల్లో తాము తలదూర్చమని చెబుతూనే... మరో పక్క చాపకిందనీరులా వారు పావులు కదుపుతున్నారు. ఆగస్టు 8న మధ్యాహ్నానికి ఎన్నికలు పూర్తి కావాలని ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్నికల అధికారిగా ఉంటారు. తహశీల్దార్, ఎంపిడిఒ, విఆర్ఒ, విఆర్ఎల్లో ఎవరో ఒకరు ఎన్నికల పరిశీలకులుగా ఉంటారు. ఒక్కో తరగతి నుంచి ఎంపికైన సభ్యుల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోనున్నారు. ఈ మేరకు పాఠశాలల్లో ఎన్నికల భాజామోగడంతో గ్రామాల్లో పార్టీలకు చెందిన నాయకుల్లో అలజడి ప్రారంభమైంది.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వ్యాపారులు

పూండి అభివృద్ధికి సహకరిస్తా

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పూండి ఉస్టాండ్ అభివృద్ధికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం రాత్రి పుండి వర్తక సంఘం ప్రతినిధులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్తకులకు అండగా నిలుస్తామన్నారు. పూండి వాణిజ్య కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి మీ మనసుల్లో మంచి స్థానం సంపాదించుకుంటానని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు పుచ్చ ఈశ్వరరావు, సీపాన గోపి, శనపతి మురళి, కొంచాడ నూకరాజు, దున్న రమేష్ పాల్గొన్నారు.

పుస్తకాలు అందజేస్తున్న కనకరాజు దంపతులు

కేంద్ర గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదువుకునేందుకు వస్తున్న విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందమంది వరకు విద్యార్థులు ఈ గ్రంథాలయంలో పుస్తకాలను చదువుకునేందుకు వస్తుంటారు. వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగరానికి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్త, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ అరికతోట కనకరాజు, ఉమ దంపతులు గ్రంథాలయాన్ని సందర్శించి విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలను అందజేశారు. వీటి విలువ రూ.15 వేలు వరకు ఉంటుందని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజా తెలిపారు. గ్రూప్-1, టెట్, డిఎస్‌సి, గ్రూప్-2, బ్యాంక్ పరీక్షలకు అవసరమైన మెటీరియల్, ఇతర ముద్రణలను వారికి అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


సిఐతో మాట్లాడుతున్న ఎంఇఒ అప్పారావు

స్కూల్ కమిటీ ఎన్నికలకు సహకరించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్కూల్ కమిటీ ఎన్నికలకు సహకరించాలని ఎంఇఒ కురమాన అప్పారావు అన్నారు. ఈ మేరకు ఎంపిడిఒ వై.రాజేంద్రప్రసాద్, తహశీల్దార్ ఎన్.వెంకటరావు, సిఐ ఇమ్మాన్యుయేల్‌రాజు, రూరల్ ఎస్ఐ లక్ష్మణరావును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రతి పాఠశాలలో విద్యాశాఖ ఆదేశాల మేరకు తల్లిదండ్రుల కమిటీ ఎన్నికలు జిఒ అనుసరించి నిర్వహించాలని హెచ్ఎంలకు సూచించారు. అనంతరం వివిధ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు.

చిరు వ్యాపారులకు గొడుగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఏలియన్స్ క్లబ్ మిత్ర ఆధ్వర్యంలో గురువారం తోపుడు బండ్లు, ఫుట్‌పాత్‌పై ఆధారపడి చిరు వ్యాపారం చేస్తున్న నిరుపేద వర్తకులకు పెద్దసైజు గొడుగుల పంపిణీ చేశారు. నగరంలో డేఅండ్‌నైట్ కూడలి జంక్షన్, చిన్న బజార్, జీటీరోడ్డు ప్రాంతాల్లో ఎండకు ఎండుతూ, వానకి తడుస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అందజేశారు. పెద్దసైజు గొడుగుల ద్వారా కొంతవరకు ఉపశమనం కలుగుతుందని క్లబ్ మిత్ర బృందం సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. క్లబ్ ప్రతినిధులు తమ సొంత నిధులతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమని స్థానికులు కొనియాడారు. కార్యక్రమంలో ఏలియన్స్ క్లబ్ మిత్ర ప్రెసిడెంట్ పొట్నూరు సూర్యప్రకాశరావు, సెక్రటరీ పి.వి. కృష్ణారావు, ఎస్.త్రినాథరావు, సీనియర్ జర్నలిస్టు బిర్లంగి రామ్మోహన్, మన్మథరావు, ఇప్పిలి శ్రీనివాసరావు, కింతలి దాలిశెట్టి, ఎ.నాగేశ్వరరావు, కాశీ విశ్వనాథం పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు బాటలు వేసుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి విద్యార్థి ఒక జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలని ఒకటవ పట్టణ ఎస్ఐ పి.కామేశ్వరరావు అన్నారు. నగరంలోని మండలవీధిలో ఉన్న రవీంద్రభారతి స్కూల్‌లో జూనియర్ చాంబర్స్ ఆధ్వర్యాన గురువారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలన్నారు. స్కూల్‌లోనే మంచి స్నేహితులను ఎంచుకుని సమిష్టిగా ముందుకు సాగుతూ లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. అప్పుడే మంచి విద్యార్థిగా ఉన్నత శిఖరాలను అందు కోగలరన్నారు. జెసిఐ అధ్యక్షులు కూన అనిల్, డాక్టర్ పైడి సింధూర, దూసి సంతోష్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఘోర చంద్‌తో పాటు అతిధులను సత్కరించారు.

డ్రమ్‌సీడర్‌తో రైతులకు ప్రయోజనం

ప్రజాశక్తి- పొందూరు

డ్రమ్ము సీడర్ విధానంలో వరినాట్లు వేయడం ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. గురువారం మండలం మొదలవలసలో డ్రమ్ము సీడర్ విధానంలో వ్యవసాయ సాగుపై అవగాహన కల్పించారు. ఈ విధానంలో వరిసాగు చేయడం ద్వారా అధిక దిగుబడితో పాటు, కూలీల కొరత సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త పి.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- పోలాకి

గ్రామాల్లో రైతులకు రెవెన్యూ సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని తహశీల్దార్ ఎం.సురేష్‌కుమార్ సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఒలతో గురువారం సమీక్షించారు. ముందుగా ప్రతి విఆర్ఒ పేరు, వారు చేసే పంచాయతీ, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. సమయపాలన పాలన కచ్చితంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో టిడి పి.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ శ్రీరామ్మూర్తి, ఆర్ఐ సతీష్ పాల్గొన్నారు.

జాగ్రత్తలతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి- కవిటి

వాతావరణ మార్పుల కారణంగా గ్రామాల్లో వ్యాధులు వ్యాపిస్తున్నాయని, తగు జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులను నివారించవచ్చని మాణిక్యపురం ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ ఎం.భాస్కరరావు అన్నారు. మండలంలోని తలతంపరలో వైద్య శిబిరం నిర్వహించిన ఆయన మాణిక్యపురం ప్రభుత్వాస్పత్రిలో రోగులను పరీక్షించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వైరల్ జ్వరాలు ఉన్నట్టు గుర్తించామని, అవీ తీవ్రస్థాయి కాకుండా సాధారణంగానే ఉన్నాయని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు వేడినీటిని తీసుకుని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. శరీరంలో ఏదైనా మార్పు వచ్చినప్పుడు సంచి వైద్యులను కాకుండా సమీపంలోని ప్రభుత్వాస్పత్రిని సంప్రదించాలని సూచించారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

శ్రీకాకుళం అర్బన్ : పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- మెళియాపుట్టి

కష్టపడి.. ఇష్టంతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అత్యున్నత శిక్షణ పొందిన అధ్యాపకులు బోధిస్తున్నారని అన్నారు. ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.పద్మావతి, అధ్యాపకులు మాధవరావు, మాజీ ఎంపిపి ఎస్.మోహనరావు, టిడిపి మండల అధ్యక్షులు భాస్కర్ గౌడ, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వరరెడ్డి, సర్పంచ్ ప్రతినిధులు రవ్వల గణపతిరావు, మాలతి, శ్రీధర్, హనుమంతు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నరసన్నపేట: విద్యార్థులందరూ బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అకాడమీ పుస్తకాలు చదివి మంచి ఫలితాలు సాధించి ఉన్నత పదవులు అధిరోహించాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేస్తోన్న ప్రయత్నంలో భాగంగా ఉచిత పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగు సరఫరా చేస్తున్నట్లు ప్రకటించారు. కళాశాల క్రీడా ప్రాంగణం మరమ్మతులు, సంక్షేమ వసతిగృహాల్లో సీట్లకు విషయాలపై బోటని అధ్యాపకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కళాశాల లైబ్రేరియన్ వదనగిరి, అధ్యాపకులు డాక్టర్ మల్లేశు, జి.శాంతారావు, ఆనందరావు, లక్ష్మీనారాయణ, హరిప్రసాద్, రాంప్రసాద్, రవి, కృష్ణవేణి, రూపవతి, కె.హరిప్రసాద్, మొదలవలస ఈశ్వరరావు ఎంఇఒలు యు.శాంతారావు, పి.దాలినాయుడు పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న 271 ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను టిడిపి మండల అధ్యక్షులు జీరు భీమారావు, శాంతిస్వరూప్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భీమేశ్వరరావు, కర్రి విష్ణుమూర్తి, పుక్కళ్ల శ్రీనివాసరావు, కాంతారావు, రెడ్డి అప్పన్న పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : ప్రతి విద్యార్థి చదువుపై అత్యంత శ్రద్ధ కలిగి ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు సాధించగలరని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రభుత్వ పురుషుల జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.

నరసన్నపేట : పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

మెళియాపుట్టి : పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

కార్యక్రమంలో ఆయన హాజరై విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. ఆర్ట్స్ కళాశాలకు వందేళ్ల చరిత్ర ఉందని, ఇక్కడున్న మట్టిలో ఎన్నో విద్యా కుసుమాలు మొలకెత్తి దేశవిదేశాల్లో స్థిరపడి ఉన్నత స్థానాలు పొందారన్నారు. ప్రతిఒక్కరు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి ఉన్నత పదవులు అధిరోహించాలన్నారు. ప్రభుత్వ విద్య బలోపేతంలో భాగంగా ప్రతిఒక్కరూ లక్ష్యాన్ని ఏర్పరుచుకుని దానిని సాధించే దిశగా ప్రయత్నం చేయాలన్నారు. చిత్తశుద్ధి, పట్టుదలతో ప్రయత్నించిన వారికి విజయాలు తప్పక సొంతమవుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.దుర్గారావు, లెక్చరర్లు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాలే శ్రేష్టం

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న శోభారాణి

ప్రజాశక్తి- కవిటి

పిల్లలకు తల్లిపాలే శ్రేష్ఠమని నెలవంక సర్పంచ్ ప్రతినిధి కుమార్ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దువ్వ కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని నెలవంక అంగన్వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక కాలంలో చాలావరకు డబ్బా పాలవైపు మొగ్గు చూపుతున్నారని, ఇది పిల్లల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపిస్తుందని అన్నారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె.శివరామప్రసాద్, గున్నయ్య, టి.హేమదాసు, బాలరాజు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసన్నపేట: నరసన్నపేట కేంద్రంలోని వర్షిని నర్సింగ్ స్కూల్ విద్యార్థులతో తల్లి పాలు వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా నర్సింగ్ స్కూల్ నుంచి ప్రధాన రోడ్డుపై ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలు ప్రాధాన్యత వివరిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పి.మోహనరావు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

కొత్తూరు : తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మెట్టూరు-2, పాడిలి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాల అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త ఎ.సరస్వతి పాల్గొన్నారు.

పాతపట్నం : ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పాతపట్నం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో తామరలో సిడిపిఒ విమలారాణి ఆధ్వర్యాన అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి, తామర సర్పంచ్ మామిడి సుధీష్ట, సూపర్‌వైజర్ అనురాధ పాల్గొన్నారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.

కవిటి : ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్ : తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి కావాల్సిన అన్నిరకాల పోషక విలువలు తల్లిపాలలో ఉంటాయని, తల్లి బిడ్డకు జన్మనిచ్చిన తరువాత గంటలోపే బిడ్డకు ముర్రుపాలు ఇవ్వాలని ఐసిడిఎస్ పిఒ శోభారాణి తెలిపారు. నగరంలోని 41, 42 డివిజన్లలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక వార్డు ఇన్‌ఛార్జిలు గుమ్మా రఘురామ్, సిహెచ్ మణితో పాటు గుజరాతీపేట సెక్టార్ సూపర్‌వైజర్ పి.ఉమ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎడబ్ల్యుడబ్ల్యుఎస్ బి.లక్ష్మి, ఝాన్సీ, పద్మావతి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. అనంతరం బాలింతలు, గర్భిణులతో బిడ్డకు తల్లిపాలు ఇస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురం సబ్‌స్టేషన్ 132/33 కెవి ఫీడర్‌లో మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో కవిటి మండల పరిధిలోని అన్ని గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పలాస: మండలంలోని నెమలి, నెమలి నారాయణపురం, రెంటికోట ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ శాఖ ఇఇ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతులు చేపట్టేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొత్తూరు : స్థానిక సబ్‌స్టేషన్ 33/11 కెవి పరిధిలోని నివగాం, ఆకులటంపర, మహాసింగి, కర్లెమ్మ, పారాపురం, మదనాపురం, సోమరాజుపురం, ఆర్.కె. పురం గ్రామాల్లో శుక్రవారం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నా మని విద్యుత్‌శాఖ ఎఇ జి.శంకరరావు ప్రకటనలో తెలిపారు.

మెళియాపుట్టి : విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఫీడర్ మరమ్మతులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని టెక్కలి విద్యుత్‌శాఖ ఎఇ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చిన్నహంస, గోకర్ణపురం, కరజాడ, ముక్తాపురం గ్రామాలకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని అన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి టౌన్ ఫీడర్-3 పరిధిలో అంజినపురం, సవరగోపాలపురం, వీరురామకృష్ణాపురం, బొరిగిపేట గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి వార్షిక మరమ్మతులు చేయడంతో ఉదయం 8 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

రక్తదాన శిబిరానికి స్పందన

శ్రీకాకుళం అర్బన్: విద్యాభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాలపై విద్యార్థులను ఆలోచింపజేస్తున్న యాళ్ల చక్రధరరావు అభినందనీయులని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఆదివారం పేట సమీపంలో ఉన్న చక్రధర విద్యాసంస్థల ఆధ్వర్యాన గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 40 మంది విద్యార్థులు ఈ శిబిరంలో రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు రెడ్డి గిరిజ శంకర్, అందవరపు సంతోష్ పాల్గొన్నారు.

బోరు నిర్మాణానికి స్థల పరిశీలన

బూర్జ: మండలంలోని ఒవిపేటలో తాగునీటి బోరు నిర్మాణానికి గురువారం స్థలపరిశీలన చేపట్టారు. వంజమ్మ పేరంటాలు సమీపంలో స్థలాన్ని గుర్తించినట్లు స్థానిక రూరల్ వాటర్ సప్లైశాఖ ఎఇ ఎం.వి.కె. నాయుడు తెలిపారు. రూ.1.5 లక్షల అంచనాలు రూపొందించినట్లు తెలిపారు.స్థానిక ఇంజనీరింగ్ అసిస్టెంట్ కల్పన, సత్యన్నారాయణ, శ్రీరామమూర్తి, బి.వి.ఎస్.ఎన్.రాజు, ప్రజలు పాల్గొన్నారు.

ఝాన్సీకి అండ

కవిటి: మండలంలోని గొండ్యాలపుట్టుగకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన బొర్ర ఝాన్సీ పోలీస్ ఎంపికల శిక్షణకు చింతామణి ట్రస్టు అండగా నిలిచింది. చదువులో చురుకుగా ఉండే ఝాన్సీ ప్రస్తుతం పోలీస్ ఎంపికలకు సంబంధించి పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతోంది. ఈ శిక్షణ నిమిత్తం చింతామణి ట్రస్టు విద్యార్థి తల్లి మోహినికి గురువారం రూ.50 వేలు అందించింది. పాండవ చంద్రశేఖర్, బెందాళం రమేష్, ఆరింగి మధు, బి. వెంకటేశ్వరరావు, పి.లక్ష్మణమ్మూర్తి, రంగారావు, ఎం.సీతాలు పాల్గొన్నారు.

జనసేనలోకి విశ్రాంత డిఎస్‌పి!

కవిటి: మండలంలోని జగతికి చెందిన విశ్రాంత డిఎస్‌పి, హైకోర్టు న్యాయవాది ఎ.ఎస్.వి.వి ప్రసాదరావు జనసేన పార్టీలో చేరేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఈ విషయమై తన హితులు, సన్నిహితులతో చర్చించిన ఆయన జనసేన పార్టీ అధిష్టానంతో కూడా మంతనాలు సాగించినట్లు తెలుస్తోంది. దీంతో ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు సమక్షంలో పార్టీలో చేరడం ఖాయమని సమాచారం. ప్రముఖులతో పరిచయాలతో పాటు సామాజిక సేవలో ముందుండే ప్రసాదరావు జనసేన పార్టీలో చేరడం నియోజకవర్గంలో పార్టీకి మేలు చేకూరుతుందని జన సైనికులు భావిస్తున్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- సోంపేట

మొక్కల నాటడం ద్వారానే పర్యావరణాన్ని పరిరక్షించుకోగలమని బేసి రామచంద్రపురం ఉన్నత పాఠశాల హెచ్ఎం చంద్రశేఖరరావు అన్నారు. పాఠశాల ఆవరణలో పలువురు విద్యార్థుల జన్మదినం పురస్కరించుకొని గురువారం మొక్కలు నాటారు. పాఠశాలలోని గ్రీన్‌ఆర్మీ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్న అన్నారు. వీటిని నివారించాలంటే మొక్కల పెంపకమే సరైన మార్గమన్నారు. ఉపాధ్యా యులు సాయిరాజ్, బి.వి.రమణ, జి.ప్రకాష్, బ్రహ్మానంద, రాజేంద్రపందా, ఎం.శంకరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని జెసిఐ సంస్థ అధ్యక్షులు షణ్ముఖరావు పిలుపునిచ్చారు.

ఇచ్ఛాపురం : మొక్కను నాటుతున్న షణ్ముఖరావు

జెసిఐ 75 వసంతోత్సవాలు సందర్భంగా పట్టణంలో హెబ్రాన్ మిస్సన్ స్కూల్ ఆవరణ, సురంగిరాజా క్రీడా మైదానంలో మొక్కలను నాటారు. జెసిఐ ప్రతినిధులు మధుకుమార్, రాము, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

మహిళలకు రక్షణ కల్పించాలి

పలాస: రాష్ట్రంలో రెండు వారాల నుంచి వరుసుగా చిన్నారులపై అత్యాచార్యులు పెరిగిపోవడం సిగ్గుచేటని, చిన్నారులు, మహిళలకు రక్షణ కల్పించే చట్టాలను అమలు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రవి డిమాండ్ చేశారు. చిన్నారులపై అత్యాచారాలకు వ్యతిరేకంగా వారికి రక్షణ కల్పించాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యాన జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్లకాట్లు చేతబట్టి మహిళలకు రక్షణ కల్పించాలని, పసికందులపై అత్యాచారం పాల్పడడం సిగ్గుచేటు అంటూ నినాదాలు చేస్తూ గురువారం ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాంప్లెక్స్ ఆవరణలో మానహారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది నెలల పసికందు నుంచి 80 ఏళ్ల వయసు ఉన్న ముసలి వాళ్లపై అత్యాచారానికి పాల్పడుతున్న మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళా హోమ్‌మినిస్టర్‌గా ఉండి కూడా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు పవన్, గుణశేఖర్, సూర్య, విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష హామీ ఇచ్చారు. మండలంలోని అక్కుపల్లి గురుకుల పాఠశాలను గురువారం సందర్శించారు. పాఠశాల స్థితిగతులపై ప్రిన్సిపాల్ జి.ప్రశాంతిని అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు సమస్య వల్ల సమీపంలోని తుపాను భవనంలో వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల భవనం గదులు శిథిలావస్థకు చేరి పెచ్చులు ఊడుతున్నాయని, పెచ్చులు ఊడి పడితే విద్యార్థులకు ప్రమాదమని, దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రిన్సిపాల్ వివరించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ... బెండికొండ వద్ద గురుకుల పాఠశాల కోసం పదెకరాల స్థలం గుర్తించామని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి నూతన భవనాలు నిర్మాణానికి నిధులు

ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాల, ఎంపిడిఒ తిరుమలరావు, డిటి వాయిలపల్లి గిరిరాజ్, టిడిపి మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, ఎస్.బాలకృష్ణ, ఎంపిటిసి కొండప్ప సురేఖ, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రూప పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

గంజాయి నివారణకు చర్యలు

పలాస : గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటామని జిఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ ఎం. సోమేశ్వరరావు అన్నారు. పలాస రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం బాల బాలికలు అక్రమ రవాణా, తీసుకోవలసిన జగ్రత్తలు, గంజాయి అక్రమ రవాణా చేయటం వల్ల కలిగే నష్టాలు, నివారణ చర్యలు, గంజాయి పదార్థాలు తీసుకోవటం వల్ల కలిగే నష్టాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఎస్.జీవరత్నం, జె.అనిత, జె.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : పింఛను అందజేస్తున్న నాయకులు

ఆస్పత్రుల్లో పింఛన్ పంపిణీ

సంతబొమ్మాళి : మండలంలోని మేఘవరం, మరువాడ పంచాయతీకు చెందిన పింఛనుదారులు డొంకాన శ్రీరాములు, యంపల్ల యర్రయ్య, యంపల్ల దిలీప్‌లు రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైస్ ఎంపిపి సూరాడ భీమారావు, మేఘవరం మాజీ సర్పంచ్ పరపటి రాజశేఖర్‌రెడ్డి, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు సూరాడ రాయుడు ఆధ్వర్యాన సచివాలయం సెక్రటరీ రామారావు, డిజిటల్ అసిస్టెంట్ రవిలు గురువారం పింఛన్లను పంపిణీ చేశారు.

పలాస : మండలంలోని అల్లుకోలకు చెందిన దువ్వాడ బంకమ్మ జిల్లా సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, సచివాలయ అధికారి అస్పత్రికి వెళ్లి పింఛను పంపిణీ చేశారు.

మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాద్

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

బూర్జ: మైనర్లు వాహనాలను నడపడం అత్యంత ప్రమాదకరమని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం సరికాదని స్థానిక ఎస్ఐ జి.వి.ప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు మైనర్ బాలురు బైక్ రైడింగ్‌పై నిషేదం, చట్టాలు, శిక్షలు, ప్రమాదాలపై అవగాహన కల్పించారు. బాలిక సంరక్షణ, ఈవ్ టీజింగ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ శశిధర్, ఎన్ఎస్ఎస్ పిఒ ఠాగూర్ మాష్టారు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇఒ రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

జనావాసాల మధ్య సెల్‌టవర్ వద్దు

పొందూరు: పట్టణంలోని లావేటి వీధి సమీపంలో అమ్మవారి ఆలయం రోడ్డులో జియో సెల్‌టవర్ ఏర్పాటును నిలుపుదల చేయాలంటూ ఆ ప్రాంత వాసులు ఆందోళన చేశారు. గురువారం మేజర్ పంచాయతీ ఇఒ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. జనావాసాల మధ్య సెల్‌టవర్ ఏర్పాటు చేయడం వలన ఉత్పన్నమయ్యే రేడియేషన్ కారణంగా ఆరోగ్యాలు దెబ్బతింటాయని ఆవేదనను వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు తక్షణమే స్పందించి సెల్‌టవర్ ఏర్పాటును నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

దుప్పట్లు పంపిణీ

ఇచ్ఛాపురం: స్వర్ణభారతి విద్యా సంస్థల చైర్మన్ చాట్ల తులసీ దాసురెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక స్వర్ణభారతి విద్యా సంస్థలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం అధ్యాపకులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

అమరావతి అభివృద్ధికి విరాళం

మెళియాపుట్టి: అమరావతి అభివృద్ధికి తమవంతు సహాయంగా మెళియాపుట్టి శిరిడీ సాయిబాబా ఆలయ ధర్మకర్త కాళ్ల రామారావు, పార్వతి దంపతులు రూ.50 వేలు విరాళం ఇచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే మామిడి గోవింద రావును గురువారం నగదును అందజేశారు. అమరావతి అభివృద్ధిలో తనవంతు సహాయం అందించినట్లు తెలిపారు. ఎస్. మోహనరావు, కాళ్ల ప్రసాద్, మాడుగల రమణయ్య, భానోజీ రావు, పరమేశ్వర్‌రెడ్డి, రాజమోహన్ మాస్టర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలంలోని దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. జాతీయ, అంధత్వ, దృష్టి లోప నివారణలో భాగంగా ఆరోగ్య విస్తరణాధికారి నాగేశ్వర రావు, హెచ్ఎం కె.చైతన్య 200 మంది విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. 13 మంది దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి కళ్లద్దాలు వాడాలని సిఫార్సు చేశారు. ఎంఇఒ-2 అర్జునుడు, ఉపాధ్యాయులు భాస్కరరావు, వీర భద్రరావు, లక్ష్మీకాంతం, ఆదికేశవరెడ్డి, తిరుపతిరావు పాల్గొన్నారు.

పూడికలు తొలగించరూ...

ప్రజాశక్తి- లావేరు

లావేరు పంచాయతీ కేసవరాయపురంలో ఇటీవల వీధి కాలువల్లో తీసిన పూడికలు తొలగించక పోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. వారం రోజులు కావస్తున్నా తరలించకపోవడంతో ఈగలు, దోమలతో పాటు దుర్గంధపు వాసన రావడంతో పిల్లలు, వృద్ధులు నివాసాల ముందు నిలువలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి పూడికలు ఇక్కడ నుంచి తొలగించాలని గ్రామస్తులు కొర్రాయ్ తవిటియ్య, ఆదినారాయణ తదితరులు కోరుతున్నారు.

తరలించకుండా ఉన్న పూడికలు